# పదునెనిమిదవ ప్రసంగము

తరువాతిరోజున స్వామి శ్రీప్రకాశానందులవారు పీఠడియా వచ్చిరని తెలిసికొని జేతపురమునుండి డా॥ లల్లూభాయివర్మ హెడ్మాష్టరు ప్రభాశంకరభాయి, ఇంకను కొందరుబ్రాహ్మణులు పీఠడియా వచ్చిరి. వారు చందనము, పుష్పములు, హారములు మొదలగునవి తీసికొని వచ్చిరి.

## పూజాసామగ్రి నిష్ప్రయోజనము.

స్వా॥ ప్రి॥ :—ఇవి అన్నియు తీసికొనిరావలసిన అగత్యమేమి? ఇంతడబ్బు మీరు వ్యర్థముగా ఖర్చుచేసిరి. ఈడబ్బు మీరు ఏబీద వానికైన ఇచ్చిన ఎంత బాగుండును?

వారిసమాధానము :— దేవమందిరములలోనికిని, గురువుల చెంతకును రిక్తహస్తములతో వెళ్ళకుండుట మాధర్మము.

స్వా. ని. :—*రిక్తపాణిస్తు నోపేయాద్రాజానం దేవతాం గురుమ్ ।*
*ఫలం పుష్పం చ వస్త్రాది యథాశక్తి సమర్పయేత్ ॥*

“రాజు, దేవుడు, గురువు- వీరివద్దకు రిక్తహస్తములతో వెళ్లరాదు. శక్తి ననుసరించి ఫలమో, పుష్పమో, వస్త్రమో ఏదియో ఒకటిఅయిన తీసికొనివెళ్లి అర్పించవలెను.” అంచుచే లల్లూభాయిచెప్పినది నిజము.

స్వా॥ ప్రి॥ :–నేను గురువును కానుకదా!

అంతట వారు హారమును కంఠమున వేయబోయిరి.

## పూలదండ పాముపలె తోచును.

స్వా. ప్రి. :—*స్రక్చన్దనవనితాదౌ సర్వత్రానిత్యవస్తుని విరక్తిః॥*

“పుష్పమాలికలు, చందనము, స్త్రీలు మొదలగు అనిత్యపదార్థములయందు వైరాగ్యము కలిగియుండవలెను.” కావున నాకు ఇవి అన్నియు నిషిద్ధవస్తువులు.

స్వా ని. :— నాకెవరైన హారముప వేసిన సర్పము పాకు చున్నట్లు తోచును.

స్వా. ప్ర. :— తమకు హారము సర్పమువలె తోచిన నాకు ఏల తోచరాదు?

లల్లూ:— తమకు పూలదండ, సర్పము రెండును సమానమే.

స్వా. ప్ర. :—ఇంకా నాకు ఆ సమానత్వము కలుగలేదు. సమానత్వమును కలిగియుండుట జ్ఞానుల లక్షణము. నేను జ్ఞానిని కాదు. నన్ను పూజించుట నావిషయమున అధర్మము.

## గురు పూజ.

ప్రభాశం :— తమకు అధర్మమే. కాని మహాత్ములను పూజించుట మాధర్మము. గీతయందు తపస్సులను వివరించుచు "దేవద్విజగురుప్రాజ్ఞపూజనమ్" అని చెప్పబడి ఉన్నది.

స్వా. ప్ర. :— నేను మీ ఒకనికే గురువును కాను. ప్రపంచమునకు గురువును. గురువు అనగా అంధకారమును పోగొట్టువాడు. "గు" అనగా అంధకారము. "రు"అనగా పోగొట్టుట. కాని ఆ అర్థము నాకు సరిపడదు. నావిషయమున వేరొక అర్థము కలదు. "గురు" అనగా భారము, బరువు. నేను ప్రపంచమునకు భారముగా నున్నాను. కావున నన్ను 'జగద్గురు' అని అనండి. హిందూదేశములో నావంటి జగద్గురువులు 52 లక్షలమంది ఉన్నారు.

ఇది విని స్వామి నిత్యానందులవారు నవ్విరి. వారు ప్రభాశంకరభాయిని ఉద్దేశించి పలికిరి.

*బ్రహ్మనిష్ఠః పరో హంసః సాక్షాన్నారాయణః స్మృతః।*
*యస్తు తం పూజయేన్నిత్యం విష్ణుస్తేన ప్రపూజితః॥*

"బ్రహ్మనిష్ఠులగు పరమహంసలు ప్రత్యక్షనారాయణులు, వారిని రోజు పూజించినచో విష్ణువును పూజించినట్లే."

శాస్త్రకారులుకూడ బ్రహ్మస్థితిని పొందిన సన్యాసిని పూజించుమని విధించిరి. కాని మాయందు పూర్ణమగు బ్రహ్మనిష్ఠత్వము లేదు. కావున మమ్ములను పూజించరాదు.

ప్రభాశం:— తమరు ఏమనినను అనండి. కాని సన్యాసిని పూజించుట మాధర్మము.

## సంసారికి ధర్మము సన్యాసికి అధర్మము.

స్వా. ప్ర. :— మీకు ధర్మమయినను పూజలను పొందుట మాకు అధర్మమే.

దాదాపు 40, 50 సంవత్సరములకు పూర్వము ఒక రాజధానికి ఒక సన్యాసి వెళ్ళెను. ఆయన చాతుర్మాస్యలుకొరకు అక్కడ ఆగెను. కావున కథలు చెప్పి, ఉపన్యసించి జనులకు ఉపదేశించెడివాడు. అచ్చటి రాజుకూడ సత్సంగమునకు వెళ్ళెడివాడు. చాతుర్మాస్యల అనంతరము ప్రయాణసమయమున ఆరాజు వారిని పూజించి ఆయనకు ఏమైన అర్పించ నుద్దేశ్యముతో ప్రధానివైపు చూచెను. స్వామివారు ద్రవ్యాదులను స్వీకరించరని దివాను సూచించెను. అంతట ఒక ఉత్తమమగు శాలువను సమర్పించవలెనని రాజు తలచెను అనంతరము రాజు, మంత్రి, అధికారిబృందము అందరును స్వామివారిని సమీపించిరి. పూజాసామగ్రి నంతయును చూచి స్వామి వారు ఇట్లనిరి:— "పూజాదులను పొందుట మాధర్మము కాదు." మహారాజు ఎంతయో బ్రతిమాలుకున్నతరువాత చందనపుష్పాదులను సమర్పించుటకు అంగీకరించెను. పూజానంతరము రాజు మూడువందలరూపాయిల విలువకల ఒక జరీశాలువను ఆస్వామికి కప్పెను. వెంటనే ఆయన దానిని తీసివేసెను. "పూజనీయా! తమరు దీనినైన స్వీకరించుడు" అని రాజు అనెను.

స్వా:— శాలువ కప్పుకొనుట మాధర్మమా? శాలువ తీసికొని రావలసిన అవసరము ఏమి?

రాజు:— అర్పించుట మాధర్మము కదా!

స్వా:— అది నిజమే. అర్పించుట మీధర్మము. తీసిపారవేయుట మాధర్మము.

## జనుల పూజలను పొందుట సన్యాసికి బంధము.

మనువు చెప్పెను:—

*అభిపూజితలాభాంస్తు జుగుప్సేతైవ సర్వశః,*
*అభిపూజితలాభైశ్చ యతిర్ముక్తోఽపి బధ్యతే॥*

"పూజలతో గూడిన భిక్షాదులను పొందుటకు సన్యాసులు సిద్ధపడరాదు. ఏలనన, పూజలతో కూడిన భిక్షాదులచే సన్యాసి ముక్తుడయినను బంధమున పడుచున్నాడు."

"ఆత్మజ్ఞానమునకు ముఖ్యప్రతిబంధము దేహాధ్యాసము. దాని నుంచి నివృత్తిని పొందుటకు సన్యాసము తీసికొనవలెను. సన్యాసము తీసికొనినపిదప దేహాధ్యాసమును వృద్ధిపొందించు విషయపంచకమును, పూజాప్రతిష్ఠాదులను త్యజించి, నిర్జనప్రదేశమునందుండి ఆత్మచింతనమును—ధ్యానమును— చేయవలెను. ఆత్మచింతనము వృద్ధిపొందిన కొలదియు దేహాధ్యాసము నివృత్తిని పొందును. అట్లు ధ్యానముచేయుచుండగా దేహాధ్యాసము పూర్తిగా పోయినప్పుడే ఆత్మసాక్షాత్కారము కలుగును." అని మనువు అభిప్రాయము.

ఇప్పటి సన్యాసులమగు మేము సన్యాసము స్వీకరించిన రోజు నుండియు పూజాప్రతిష్ఠలకు లోనగుదుము. అందుచే దేహాధ్యాసము తగ్గుటకు బదులు పెరుగును. "దేహమే నేను" అను భ్రాంతి కలుగును. నెమ్మది నెమ్మదిగా వారు దేహాత్మవాదులు అగుదురు. అవిద్యాబంధనమునుండి ముక్తిని పొందుటకు బదులు బంధమునందు

చిక్కుపడుదురు. పూజలేకాదు, లోకసంసర్గముకూడ పెరిగిపోవును. పాములవాడు పుట్టదగ్గరకు వెళ్లి నాగస్వరమును ఊదును. అది విని కృష్ణసర్పము బయటకు వచ్చును. వెంటనే పాములవాడు దానిని పట్టుకొని బుట్టలోపెట్టి మూతవేయును. జాతియైన సర్పము నాగస్వరము వినికూడ బయటకు రాదు. అనగా పాములవానికి లోబడదు. అసలైన నాగసర్పమేదియు కరవదు. అందుచే దానివిషము ఘనీభవించి మణిరూపమును పొందును. అది 'మణిధరము' అనిచెప్పబడును. బుట్టలోనున్న సర్పమును పాములవాడు ఆడించును. ఆపాము బుస్సకొట్టినను, ఎవరినైన కాటువేసినను ప్రమాదము లేదు. అటులనే తీవ్రవైరాగ్యము కలవాడు నిస్సంగుడుగానుండి, ఏకాంతమున కూర్చుండి యోగాభ్యాసముద్వారా జ్ఞానమును సంపాదించును. మావంటి మందవైరాగ్యము కలవాడు మీవంటివారి సంసర్గముచే సర్పమువలె పరాధీనుడగును. అంతట మీరు ఆడించినట్లు మేము ఆడవలసివచ్చును. బుట్టలోనున్న పాము (కోరలుతీయబడినది) విషము ఎవరికిని ఎక్కనట్లుగను, ఎవరిని బాధించనట్లుగను మాఉపదేశములుకూడ ఏమియును ప్రయోజనము కలిగియుండవు. ఎవరి అవిద్యాంధకారమును నశింపజేయవు. పాములవాడు నాగస్వరమోహములో పడిన సర్పమును పట్టుకొని బుట్టలో మూసినట్లు సంసారులగు మీరు విషయాదిసాధనములచే సాధువులను, సన్యాసులను ముగ్ధులుగచేసి వివేకాదిచతుస్సాధనములను నశింపజేసి, మఠాదులను నిర్మించి వానిలోనికి చేర్చెదరు. అంతట సాధువులును, సన్యాసులునుకూడ పాములవాని బుట్టలోనున్న సర్పమువలె ఏమియు చేయలేరు. ఆకారణముచేతనే మనువు ఇట్లనెను:—

"గ్రామమన్నార్థమాశ్రయేత్,"

"భిక్షకొఱకుమాత్రమే సన్యాసి గ్రామములోనికి వెళ్ళవలెను."

సన్యాసి 5 రకములగు భిక్షలను పొందవచ్చును. వానిలో 'మధుక

రము' ఉత్తమమైనది. అనగా ఇంటింటికి వెళ్ళి బయటనుండి భిక్షను అడుగవలెను. ఏలనన, ఒకచోటనే ఉండి భిక్షచేసినచో ప్రజల సంసర్గము ఏర్పడును. అందుచే అవిద్యాబంధమున చిక్కువడును.

## పరమజ్ఞానులు.

ప్రిభాశం:—జ్ఞానులకుకూడ భిన్నభిన్న ప్రారబ్ధములు ఉండునుకదా! వానికతమున వారుకూడ వైభవాదులను అనుభవించుటలో అభ్యంతరమేమి?

స్వా. ప్రి. :—*కృష్ణో భోగీ శుకస్త్యాగీ నృపౌ జనకరాఘవౌ ।*
*వశిష్ఠః కర్మకర్తా చ పఞ్చైతే జ్ఞానినః సమాః॥*

"శ్రీకృష్ణుడు భోగి. శుకుడు సన్యాసి. జనకుడును, రాముడును రాజులు. వసిష్ఠుడు కర్మిష్ఠి. అయినను ఈ అయిదుగురును సమానులే. అనగా వీరికి ఆత్మసాక్షాత్కారము సమానముగా జరిగినది."

ప్రభాశంకరభాయి జ్ఞానికి వివిధములగు ప్రారబ్ధములు ఉండునని తలచుచున్నట్లు కన్పట్టుచున్నది. ఈసందర్భమున వారికి పై శ్లోకము ప్రమాణముగాకూడ కన్పించవచ్చును. ఈశ్లోకమును మనస్సునందు ఉంచుకొనియే ఆయన జ్ఞాని వైభవాదులయందు ఉన్న అభ్యంతరమేమి అని శంకించెను. కాని కృష్ణుడు వైభవములతో జీవితము గడుపలేదు. కృష్ణభోగానుభవమునకు చెందినఘట్టములు భాగవతములోనివి అధికపాఠములుగా తోచుచున్నవి. కృష్ణుడు గోవర్ధన పర్వతమును ఎత్తెను కదా! ఒకదృష్టితో ఆలోచించిన కృష్ణుడు కేవల జ్ఞానికోటిలోనికి మాత్రమే రాడు. ఆయన దేవకోటిలోనివాడు. అటులనే శ్రీరామచంద్రుడుకూడ పెద్దపెద్దరాళ్ళను నీటిపై తేల్చెను. ఆయనకూడ దేవకోటిలోనివాడే.

"*కృష్ణో భోగీ శుకస్త్యాగీ*" అను శ్లోకము యోగవాశిష్ఠమునందలిది. యోగవాశిష్ఠము వాల్మీకి వ్రాసినది ఏమియు కాదు. ఇప్పటి

విద్వాంసులెవరో వ్రాసిరి. ఈరోజులలో విద్వాంసులు ఎంతరో స్వేచ్ఛాజీవితమును గడుపుచున్నారు. వారు తమసుఖభోగములను సమర్థించుకొనుటకు ఇట్టి శ్లోకములను వెలికితీసి ప్రజలకు ప్రమాణముగా చూపించి తమ ఇష్టమువచ్చినట్లు సంచరించెదరు. ఈశ్లోకము శ్రుతి, స్మృతులకు విరుద్ధమగుటచే ప్రమాణము కాదు.

జగమున రెండురకముల మనుష్యులు కలరు. అసురులు, దేవతలు. అసురసంపదకలవారు అంతరమున నాస్తికులు. వారు ఈశ్వరుని అస్తిత్వమును అంగీకరించరు. వేదశాస్త్రములు ధూర్తులెవరో రచించిరని వారు విశ్వసించెదరు. కాన జగమున పూజలు, గౌరవము, ధనాదిఐశ్వర్యములు పొందుటకు మాత్రమే వారు వేదశాస్త్రములను అభ్యసించెదరు. వానిసహాయముచే స్వేచ్ఛగా సంచరించెదరు. దైవసంపదగలవారు ఆస్తికులు. వారు వేదశాస్త్రములు ఈశ్వర ప్రణీతములని విశ్వసించెదరు. వానిని పరమాత్మని తెలిసికొనుటకు మాత్రమే అభ్యసించెదరు. పరమాత్మని తెలిసికొనిన తరువాత ఏకాంతమున కూర్చొని యోగాభ్యాసముద్వారా పరమాత్మానుభవమును పొందెదరు. వారిలోని మందవిరాగులు శాస్త్రములను అభ్యసించి సవికల్పసమాధిపర్యంతము వెళ్లగలరు. అంతట అలసి వెనుకపడిపోవుదురు. శాస్త్రములయందు వ్రాయబడిన ఫలము అసత్యమని తలచి భోగవిలాసములలో మునిగిపోయెదరు. వారు ఆస్తికులనబడరు. నాస్తికులుగా పరిగణించబడుదురు. వీరు కొంతవరకు స్వేచ్ఛాచారులే. కాని తీవ్రవైరాగ్యవంతులు మాత్రము సమాధి సుఖమును అనుభవించెదరు.

"తీవ్రసంవేగానామాసన్నః సమాధిలాభః" అని యోగసూత్రములు చెప్పుచున్నవి.

తీవ్రవైరాగ్యము కలవానికి సమాధి త్వరలో లభించును.

శ్రవణ, మననముల అనంతరము కలుగు నిదిధ్యాసనము యొక్క పరిపక్వావస్థ సవికల్ప సమాధి. సవికల్పసమాధియొక్క పరిపక్వదశ నిర్వికల్పసమాధి. ఈనిర్వికల్ప సమాధియందు యోగులు బ్రహ్మసుఖమును అనుభవించెదరు.

నిర్వికల్పసమాధిద్వారా ఆత్మసాక్షాత్కారము అయినవారికి సహజముగా దేహాభిమాననివృత్తి కలుగును. దేహమునందలి అహం బుద్ధిచే అనేకరకములగు విషయపదార్థములను అనుభవించవలెనను కోరిక కలుగును.

*"దేహాత్మనా సంస్థిత ఏవ కామీ విలక్షణః కామయితా కథం స్యాత్,"* అని శంకరులు పలికిరి. దేహమే ఆత్మ అనువాడు కామి. ఆత్మ దేహము కంటె భిన్నమైనది అని అనుకొనువాడు కామి ఎట్లగును? దేహము నందు ఆత్మబుద్ధిలేని మహాత్ములయొక్కయు, సమాధియందు స్థిరమగు చిత్తము కలవారియొక్కయు స్థితినిగురించి రామగీతలో చూడుడు.

## నిర్వికల్పసమాధినిష్ఠుడగు బ్రహ్మవేత్తయందు స్వేచ్ఛాచారము ఉండదు.

*అభిమానవిహీనానాం సమాధ్యానక్తచేతసామ్,*
*స్వేచ్ఛాచారో న షణ్ణస్య వేశ్యాలౌల్యమివోద్భవేత్॥*

"దేహాభిమానరహితుడై సమాధినిష్ఠుడగు జనుడు స్వేచ్ఛా వృత్తిని కలిగియుండడు. నపుంసకుడు వేశ్యాలోలుడు కాడుకదా!"

జ్ఞానికి సమాధికాలమున ధ్యాత, ధ్యానము అను ద్వైతము ఉండదు. కేవలము స్వస్వరూపమను ధ్యేయైకగోచరత్వము మాత్రమే ఉండును. సమాధియందు ఆసక్తికల చిత్తముకలవారు సమాధ్యాసక్తులు. కాని జ్ఞానికి ఆసక్తి అనగా అభినివేశపురస్సరమగు ప్రవృత్తి సమాధియందు ఉండదు. ఇచ్చట ఆసక్తి అను శబ్దమునకు స్వరూపము నందు ఉండుట అని మాత్రమే అర్థము. ఇట్టి సమాధినిష్ఠుడగు జ్ఞాని

సమాధియందు బ్రహ్మసుఖమును అనుభవించును. అట్టి జనుడు సాంసారికములగు తుచ్ఛసుఖములను కోరడు. చక్రవర్తి మార్గమునందు నడచుచు, ఒక ద్వారముచెంత గృహస్థుడు భిక్షుకులకు దానము చేయుచుండుట చూచి చేయి చాచడుకదా! అటులనే బ్రహ్మసుఖమును పొందిన జ్ఞాని తుచ్ఛసుఖమును కోరడు.

ఈవిషయము శాస్త్రమున చెప్పబడినది:—

*లబ్ధ్వా త్రైలోక్యరాజ్యోఽపి న భిక్షాం కాఙ్క్షతే యథా।*
*ఏవం లబ్ధపరానన్దః క్షుద్రానన్దం న కాఙ్క్షతి ॥*

"త్రిలోకరాజ్యాధిపత్యము పొందినవాడు భిక్షాటనమును కోరనట్లు నిరతిశయఆనందము పొందినవాడు తుచ్ఛమగు విషయానందమును కోరడు."

ఇటులనే సమాధిద్వారా దేహేంద్రియాదులయందు అహంబుద్ధిని పోగొట్టుకొని తన ఆత్మయందు స్థిరముగ నున్నవాడు దేహాపేక్షచే దేనిని కోరడు.

*ఆత్మానం చేద్విజానీయాదయమస్మీతి పూరుషః।*
*కిమిచ్ఛన్ కస్య కామాయ శరీరమనుసంజ్వరేత్ ॥*

"ఏజీవాత్మ తనస్వరూపమును "నేను పరమాత్మను" అని తెలిసికొనకలదో ఆజీవాత్మ ఏఫలముకొరకు శరీరమును బాధించును? అనగా బాధించదు. స్వరూపనిష్ఠాపరాయణులగు సత్పురుషులు మాయారచితములగు, ఐహికపారలౌకికములగు పదార్థములను కొంచెముకూడ కోరరు. సాక్షాత్తు పరమేశ్వరుడే వచ్చి ఉభయలోకములయందలి పదార్థములను ఇచ్చినను జ్ఞాని స్వరూపనిష్ఠుడైనందున ఏపదార్థమునందును ప్రేమ కలిగియుండడు. ఈవిషయమున పూర్ణకాముడును స్వరూపమగ్నుడును అగు సనత్కుమారుని కథ కలదు.

ఒకానొకసమయమున గంగాతటమున స్వరూపనిమగ్నుడగు సనత్కుమారమహర్షి కూర్చుని ఉండెను. చలివేయకుండుటకు చినిగి పోయిన వల్కలములతో తయారుచేయబడిన బొంతను పొదలనుండి తీయబడిన ఎండుతీగలతో ముండ్లసహాయమున కుట్టుకొనుచుండెను. సనత్కుమారుని ఈ పరిస్థితి చూచి విష్ణుభగవానుడు సంతోషించెను. ఆయన హృదయములో మాయాజన్యపదార్థములయందు కోరిక కలదో లేదో పరీక్షించదలచెను. ఈ యుద్దేశ్యముతో ఆయన సనత్కుమారునకు సాక్షాత్కరించి అడిగెను:— "మహర్షి, వరమును కోరు కొనుము." సనత్కుమారుడు నిరుత్తరుడయ్యెను. వరముకుగమని మరి యొకమారు శ్రీమన్నారాయణుడు చెప్పెను. సనత్కుమారుడు ఇట్లు తలచెను:— విష్ణుభగవానుని మూలావిద్య ఉపాధి. నాశరీరము తూలా విద్యయొక్క కార్యము. తూలావిద్యావిశిష్టుడగు మనుష్యుడు మూలా విద్యావిశిష్టుడగు పరమేశ్వరుని సన్మానించుట యుక్తము. ఇది మాను షికమగు మర్యాద. అంతియే కాదు. ఈ చెట్టునీడకు నేను మొదట వచ్చి కూర్చొంటిని. నాతరువాత విష్ణువు వచ్చెను. నాకు ఆయన అతిథి. అతిథిని సన్మానించుటకూడ మానవకర్తవ్యము. ఈ రెండు భావములతోను పూర్ణమగు హృదయముకల ఆత్మారాముడగు సనత్కుమారమహర్షి అనుగ్రహదృష్టితో విష్ణుభగవానునితో చెప్పెను. "ఓవిష్ణూ! ఈ లోకమునందుకాని, పరలోకమునందుకాని ఉన్న మాయాపదార్థములను గురించి నాకు ఏమియు కోరిక లేదు. నేను నా అఖండస్వరూపానందమునందు నిమగ్నుడనై ఉన్నాను. అందుచే పదార్థాభిలాషతో ఏవరమును కోరుట లేదు. కాని తమరు అమోఘ వచస్కులు. తమ వరములు అమోఘములు. అవి నిష్ఫలము అవ రాదు. ఆవిధముగా తమకు సన్మానముకూడ జరుగును అను భావ నతో వరము కోరుచున్నాను, నేను బొంతకుట్టుకొనుటకు ఉపయో

గించు ముల్లు సూది అగుగాక! తీగలు దారమగుగాక! ఈ లెంటితోను నాపని జరిగిపోవును. ఇది అయినను తమను సన్మానించుటకు మాత్రమే అడుగుచున్నాను.'' స్వరూపమగ్నుడగు సనత్కుమార మహర్షి చెప్పిన ఈమాటలు విని విష్ణుభగవానుడు చాల సంతోషించెను. వారియందు ఎంతయో సద్భావమును ప్రదర్శించి అంతర్ధానమయ్యెను. ఇట్లు విష్ణుభగవానుడే స్వయముగా కోరినపదార్థములను ఇచ్చెదనన్నను జ్ఞానులు ఆపదార్థములను స్వీకరించరు. ఇక ఈలోకమునందును, పరలోకమునందును అనేకములగు జీవులు అనుభవించు ఉచ్ఛిష్టములును, తుచ్ఛములును, అగు పదార్థములను ఎట్లు కోరగలరు? ఏలనన జ్ఞానికి ఆత్మానందముచే కలుగు సుఖము అవర్ణనీయము, అపూర్వము.

## దేహాభిమానములేని జ్ఞాని.

ఇట్లు సమాధినిష్ఠుడగు జనునకు దేహాభిమానము ఉండదు. ఏలనన, అభిమానము అసురసంపద.

న చాధ్యాత్మాభిమానోఽస్తి విదుషోఽస్యాసురత్వతః।
విదుషోఽప్యాసురత్వం చేన్నిష్ఫలం బ్రహ్మదర్శనమ్॥

(నైష్కర్మ్యసిద్ధి)

"విద్వాంసునకు_అనగా తత్త్వవేత్తకు దేహాభిమానము ఉండదు. దేహాభిమానము అసురసంపదయొక్క కార్యము. తత్త్వవేత్తకు కూడ అసురసంపద ఉన్నచో బ్రహ్మసాక్షాత్కారము నిష్ఫలము. అసురసంపద ఉన్నవారికి బ్రహ్మసాక్షాత్కారమే కలుగదు.''

సమాధిద్వారా ఎవడు "స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు నేను కాను, అధిష్ఠానమగు కూటస్థస్వరూపుడను'' అను జ్ఞానము పొందినవానికి దేహాభిమానము నిస్సంశయముగా ఉండదు.

## సమాధినిష్ఠుడు స్వేచ్ఛాచారి కాడు.

సమాధినిష్ఠుడు జ్ఞాని. అతడు స్వేచ్ఛాజీవి కాడు. ఆసక్తిని—అనగా లయము, విక్షేపము మొదలగు దోషములను పరిత్యజించి, సమాధిద్వారా చిత్తవృత్తిని బ్రహ్మమునందు నిలిపి, ఆవరణదోషమును నివృత్తినొందించుకొనిన జ్ఞాని స్వేచ్ఛాచారి కాడు. శాస్త్రజ్ఞలను ఉల్లంఘించి లోకవిరుద్ధముగా సంచరించువాడు స్వేచ్ఛాచారి.

శాస్త్రాజ్ఞలు అజ్ఞానికి, జ్ఞానికి కావు అని కొందరు చెప్పుదురు. ఇది బాగుగనే ఉన్నది. కాని జ్ఞానిమాత్రము స్వేచ్ఛాచారి కాడు. అజ్ఞానులే స్వేచ్ఛాచారులు. ధనవంతునితో కాని, రాజుతో కాని పోలీసులు దొంగతనము చేయవద్దని చెప్పరు. దొంగలకే చెప్పుదురు. అందుచే ధనవంతులును, రాజులును దొంగతనము చేయుటకు వీలు లేదుకదా.

## యథేష్టాచరణమును చేయని ముముక్షువు.

అట్లు ఇష్టమువచ్చినట్లు సంచరించుటకు ముముక్షువుకూడ సందేహించును. ఇక జ్ఞానిసంగతి చెప్పనేల?

*ముముక్ష్వవస్థాయామపి న సంభవతి యథేష్టాచరణం తదాహ—*
*యో హియత్ర విరక్తః స్యాన్నాసౌ తస్మై ప్రవర్తతే।*

(నైష్కర్మ్యసిద్ధి)

ముముక్షుదశయందుకూడ యథేచ్ఛగా సంచరించుట జరుగదు. వైరాగ్యమును పొందిన మనుజుడు మరల ప్రవృత్తికిరాడు. వివేకముద్వారా పదార్థములన్నియు మాయాకార్యములగు విషయాదికములు అని తెలిసికొని అవి అసత్తులనియు, జడములనియు, దుఃఖస్వరూపములనియును గ్రహించును. అంతట వానియందు కోరికను కలిగియుండడు.

*లోకత్రయవిరక్తత్వాన్ముముక్షుః కిమితీహతే।*
*క్షుధయా పీడ్యమానోఽపి న విషం హ్యాయమిచ్ఛతి॥*

"ఆకలితో బాధపడుచున్నను మానవుడు విషమును తినవలె నని తలచడు. అటులనే ముముక్షువు మూడు లోకములయందును విర క్తి ని పొందితదుపరి విషయాదిపదార్థములను ఎట్లు కోరును?"

మానవునకు ఎంత ఎక్కువ ఆకలియున్నను విషసిక్తము లయిన పక్వాన్నములు, మృష్టాన్నములు మొదలగు రుచ్యములగు పదార్థములను సహితము శత్రువుతో సమానముగా భావించి పారవే యును. ఎంత బ్రతిమాలుకొనినను తినడు.

*మిష్టాన్నధ్వాస్తతృడ్ (విషం) జానన్నామూఢ స్తజ్జిఘృక్షతి।*
*యతోఽవగతపరమార్థతత్త్వస్య యథేష్టాచరణం న మనాగపి ఘటతే॥*

"మృష్టాన్నోపభోగముచే ఆకలి తీరిన బుద్ధిమంతు డెప్పుడైన ఎరిగియుండియే విషమును తినగోరునా? అటులనే పరమార్థతత్త్వ మును పొందినవాడు స్వేచ్ఛాజీవితము గడుపగోరడు."

వివేకముచే మాయాకార్యములగు విషయాదిపదార్థములు బం ధములని తెలిసికొనినవాడు మోహహీనుడగును. అతనికి పరమార్థ తత్త్వసాక్షాత్కారము కలుగును. అతడు ఎట్లు యథేష్టాచరణమును చేయును?

## స్వేచ్ఛాచారముచే తత్త్వజ్ఞానమహిమ నశించును.

తత్త్వజ్ఞాని అయినను స్వేచ్ఛాజీవి అయినచో తత్త్వజ్ఞాన మహిమ నశించును. నిర్వికల్పసమాధిద్వారా ఆత్మసాక్షాత్కారము అయిన తత్త్వవేత్తకు ఏపదార్థమునందును రాగము కలుగదు. రాగము అజ్ఞానలక్షణము. "*రాగో లిఙ్గమబోధస్య*" అని శాస్త్రములు కూడ చెప్పుచున్నవి. రాగముద్వారా బహిర్ముఖుడయి అనాచార ములు చేయువాడు జ్ఞాని కాడు. అజ్ఞానియే. శరీరనిర్వాహణమునకు జ్ఞానికికూడ భోజనాద ఇచ్ఛలు కలుగును. అయినను జ్ఞానికి కలుగు

కోర్కెలు అజ్ఞానికి కలుగు కోర్కెలవంటివి కావు. జ్ఞాని కర్మములు శరీరనిర్వహణమును పూరించునవియే.

## మరియొక సందేహము

"తత్త్వమసి" మహావాక్యముద్వారా జ్ఞానము కలుగును. అట్టి పరిస్థితిలో సమాధి అవసరమే లేదు. సమాధి మందజిజ్ఞాసువు కొరకు అనెదరు. కాని "తత్త్వమసి" అను మహావాక్యముద్వారా కలుగునది దృఢముకాని పరోక్షజ్ఞానముమాత్రమే. అపరోక్షజ్ఞానము సమాధిద్వారామాత్రమే కలుగును. ఈవిషయమున ఆచార్యుల వాక్యములు ప్రమాణములు:—

*నిర్వికల్పసమాధినా స్ఫుటం బ్రహ్మతత్త్వమవగమ్యతే ధ్రువమ్।*
*నాన్యథా చలతయా మనోగతేః ప్రత్యయాన్తరవిమిశ్రితం భవేత్॥*

"నిర్వికల్ప సమాధిచే స్పష్టమును, దృఢమును అగు బ్రహ్మతత్త్వాపరోక్షజ్ఞానము కలుగును. మనశ్చాంచల్యముచే మరొకవిధముగ ఎట్లును ఆ జ్ఞానము కలుగదు. మరియొకపథముగ ఏమైన జ్ఞానము కల్గిన అది భ్రమజ్ఞానముచే మిశ్రితమైనది."

ఈరోజులలో మావంటివారు చాలమంది వైరాగ్యసాధనముల అభావముచే సమాధియందలి అసమర్థతచే శాస్త్రములుమాత్రము చదివి "నేను జ్ఞానిని, నాకు పుణ్యపాపములు అంటవు."అని తలచి ఇష్టమువచ్చినట్లు సంచరించెదరు వారికి పరమగతియగు మోక్షము లభించదు. ఇట్టివారినిగురించి రామగీతయందు శ్రీరామచంద్రుడు చెప్పినమాటలు ఇవి :—

*సమాధిరహితా మర్త్యా స్తత్త్వార్థజ్ఞానిమానినః।*
*జగత్ప్రతారణే దక్షా న తేషాం పరమా గతిః॥*

"సమాధిద్వారా బ్రహ్మజ్ఞానము పొందనివారు, మేము తత్త్వార్థము తెలిసికొనినాము అనుకొనుచు జగత్తును మోసగించుటలో

తెలివితేటలను కలిగియుందురు. వారికి పరమగతియగు మోక్షము లభించదు."

## దాంభికులగు ఆచార్యుల లక్షణము.

కొందరు వైరాగ్యము మొదలగు సాధనసంపత్తి లేనందున సమాధిని పొందుటకు అసమర్థు లగుదురు. వారు వేదాంతశాస్త్రము లనుమాత్రము చదివి వాచాలు రగుదురు. "నేను జ్ఞానిని" అను గర్వమును పొందెదరు. ఆ గర్వముతో వారు ప్రపంచమును మోసగించెదరు. ఇట్టి అసురసంపదకల దాంభికులు ఉద్యోగవ్యాపారాదుల ద్వారాకంటె ధర్మవ్యాజముద్వారా ఎంతయో ధనమును సంపాదించెదరు.

ఒక బ్రాహ్మణుడు ఒక సేఠ్ వద్ద ఉద్యోగము చేయుచుండెను. ఒకరోజున ఆ సేఠ్ తన ఇంటివద్దకు ఒక ఆచార్యుని పాదపూజకు పిలిపించెను. ఆబ్రాహ్మణుడు పాదపూజాసమయమున ఆచార్యునికిచేయు అట్టహాసములను, వైభవములను చూచెను. "ధనము సంపాదించుటకు ఇదియే మంచి ఉపాయము. ప్రపంచమున పూజ, గౌరవము కూడ లభించును. నేనుకూడ ఇట్లు ఆచార్యుడను అయినచో ఏమాత్రము శ్రమయు అక్కరలేకుండగనే పూజాగౌరవములతోసహా సంపదను పొందగలను.అంతేకాకుండ అసంఖ్యాకములుగా జగమునందున్న మూర్ఖశిరోమణులను చేజిక్కించుకొనగలను." అని అతడు తలచెను. ఈవిధముగ ఆలోచించి ఆబ్రాహ్మణుడు శేఠ్ దగ్గర చేయు ఉద్యోగమును విడచివేసెను. కొద్దిరోజులు ఒకపండితునివద్ద వ్యాకరణమును, వేదాంతశాస్త్రమును అభ్యసించెను. అనంతరము ఒక పుణ్యక్షేత్రము చెంతనున్న ప్రాచీనశివాలయమునకు చేరెను. లోనికి ప్రవేశించి ద్వారము మూసుకొని దంభముతో కూర్చునియుండెను. ఇద్దరు మనుష్యులను అక్కడ కాపలా ఉంచెను. ఎవరైన దర్శనమునకు వచ్చి

నచో వారు గురువుగారు సమాధిలో నున్నారు. అని చెప్పెడివారు; చుట్టుప్రక్కలనున్న ప్రదేశములకు ఈసంగతి వ్యాపించెను. ఎవరో సమాధినిష్ఠుడగు మహాయోగి విచ్చేసిరని వారు తలచిరి. జనులకు ఈవార్త తెలిసినకొలదియు గుంపులుగుంపులుగా వచ్చి దర్శనము చేసికొని ఎంతో భక్తితో ఆయనను పూజించమొదలిడిరి "ఏ శాస్త్ర విషయములనైన శ్రవణముచేయించి తమ అమృతవాక్కులను పానముచేయ ననుగ్రహించు"డని జనులు ఆయనను కోరిరి.

శ్రీవారు జనులు ఎప్పుడు తమను ఉపన్యసించమని కోరుదురా అని ఎదురుచూచుచునే ఉండిరి. ఆకారణముచే వారి కోరికను మన్నించి గీతాప్రవచనమును ప్రారంభించిరి. నెమ్మదినెమ్మదిగా జనులు అంతకంతకు ఎక్కువగా రాసాగిరి. శ్రీవారిఖ్యాతి నలుమూలలకు వ్యాపించసాగెను, కొందరు వారిని గురుమంత్రమును ఉపదేశించమనికూడ విన్నవించుకొనిరి. అంతట వారు మంత్రోపదేశమును కూడ ప్రారంభించిరి. వేలకొలది జనులు వారిశిష్యులయిరి. రాబడి కూడ ఎక్కువ అవసాగెను. ఇట్లు ఆ గురువుగారికి చాలధనము లభించెను. వారి వైభవముకూడ పెరిగెను. సకలవైభవములతోడను భూమండలాచార్యబిరుదమును, ఛత్రచామరాదులను సంపాదించెను.

తులసీదాసు రచించిన రామాయణములో కలియుగమును వర్ణించుచు కాకభుశుండి గురువును ఉద్దేశించి ఈవాక్యములను చెప్పెను:—

సోయీ సాయన జో పరధనహారీ,
జే కరుదంభ సో బడ ఆచారీ.

"పరధనహారి ధనికుడుగాను, దంభపరుడు గొప్ప ఆచారవంతుడుగాను గ్రహింపబడును." అంతేకాదు. తన వైభవమును సమర్థించుకొనుటకు ఉపన్యాసములయందు ఇట్లు చెప్పెడివాడు. "ఆచార్యులు

ఛత్రచామరాదులను ధరించవలెను. లేనిచో అజ్ఞానులకు తెలియదు బయటనుంచి చూచినతోడనే అజ్ఞానుల హృదయములలో పరివర్తనము కలుగును. తద్ద్వారా వారికి దర్శనము, శ్రవణము, సమాగమము చేయుటకు అవకాశము దొరకును. అనువారు మమ్ము స్పృశించుటకు వీలులేకుండ పాదుకలనుమాత్రమే స్పృశించి నమస్కరించుటకు పాదుకలను ఉపయోగించవలెను. గురువునకు పాదపూజ ఎట్లు చేయవలెనో కూడ తన ప్రవచనములలో ఆయన నొక్కివక్కాణించుచుండెడివాడు. గురువుగారికి సాష్టాంగదండప్రణామము ఆచరించవలెను. నిలబడియుండియే నమస్కరించుట ధూర్తత్వము. గురువుగారిచెంతకు వట్టిచేతులతో వెళ్ళరాదు. వారికి ఏదైన కానుకను తేవలెను గురువుగారి పాదపూజ తన ఇంటివద్ద చేయవలెను. అందుకు వారిని మేళతాళములతో తీసికొని వెళ్ళవలెను. ఈజగమున గురువే పరమాత్మస్వరూపము. గురువే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుడు. సాక్షాత్తు పరబ్రహ్మము గురువే. గురుమూర్తియే ధ్యానమునకు మూలము. కావున గురువే ఉపాస్యము అని శాస్త్రములు చెప్పుచున్నవి. ఈవిధముగా ఆయన చెప్పు ఉపదేశములను విని సామాన్యజనులు ఆయనచెప్పినట్లు చేసి వారిని గౌరవించెడివారు. అటుతరువాత ఆయన జనులలో ఇంకను ఎక్కువ ప్రసిద్ధిని పొందుటకు యజ్ఞమును ఆరంభించెను. ఆ యజ్ఞమునకు వేలకొలది జనులు వచ్చుచుండిరి. ఈవిధముగా ఆయన దంభము రోజురోజుకు పెరిగిపోయెను. ఎంత మహాపురుషుడు వచ్చి నమస్కరించినను మరల నమస్కరించెడివాడు కాదు. ఆశీర్వదించెడివాడు.

ఇట్టి అసురజనుల లక్షణములు గీతలో వివరించబడినవి:—

ఆత్మసంభావితాః స్తబ్ధాః ధనమానమదాన్వితాః।
యజన్తే నామయజ్ఞైస్తే దమ్భేనావిధిపూర్వకమ్॥

"అసురులు ఆత్మసంభావితులు. సర్వగుణసంయుక్తుల మగుటచే మేము అందరికంటె శ్రేష్ఠులము అనుకొనెదరు. వారు దాంభికులు. అందుచే శాస్త్రవిధులకు వ్యతిరేకముగా పేరుకుమాత్రము యజ్ఞములను చేయుదురు." అట్లు ఎవరికి వారు పూజ్యత్వమును పొందెదరు. అసురులు స్తబ్ధులు. వారు వినయశీలురు కారు. నమ్రత్వము లేకపోవుటకు కారణము వారు ధనమానమదయుక్తులగుటయే. స్వర్ణము, పశువులు, ధాన్యము, గృహములు, భూమి మొదలగు ధనసంపద వారికి అధికముగా నుండును. తాను పూజ్యుడనను అతిశయముతో కూడిన అధ్యాసము మానము. ఈ మానముకలవారు ఇతరులగు శ్రేష్ఠవ్యక్తులు తమకంటె పూజ్యులు కారు అను భావమును కలిగియుందురు. అది మదము. ఈగుణములు కలవారు విధివిహితముకాని విధమున యజ్ఞములను చేయుదురు. అవి పేరుకుమాత్రము యజ్ఞములు. ద్రవ్యము, దేవత, మంత్రము, దక్షిణ మొదలగునవి యజ్ఞాంగములు. అసురపురుషులు వీనిని సంపూర్తిగా ఆచరించరు. వానియందు శ్రద్ధాభక్తులు కలిగియుండరు. దంభముకొరకుమాత్రమే, అంతఃకరణమునందు శ్రద్ధలేకపోయినను జగమునందు ధర్మాత్ములనిపించుకొనుటకు మాత్రమే ఆచరించెదరు. ధనసంపాదనమునకుమాత్రమే వారు ఈ కర్మలను అన్నిటిని ఆచరించెదరు. ఈ అసురలక్షణము లన్నియు ఆచార్యులవారియందు ఉండెను.

అంతకంతకు పల్లెగ్రామములనుండికూడ పాదపూజకు జనులు ప్రార్థించసాగిరి. స్వామివారు మేళతాళములతో వారిఇండ్లకు వెళ్ళి పాదపూజలు చేయించుకొని కానుకలను స్వీకరించెడివారు. ఆయన ఏ ఇంటికి వెళ్ళిన ఆ యింటివారికి ఎంతయో ఉపకారము చేసినట్లు ప్రకటించెడివాడు. తాను ప్రత్యక్షదైవమనియు, తనయందు భక్తి కలవారు జీవన్ముక్తులగుదు రనియు ప్రకటించెడివాడు.

ఇతరగ్రామములకు వెళ్ళునప్పుడు ఆగ్రామస్థులతో ముందుగనే ఆయన ధనసంబంధమగు నిర్ణయములు చేసికొనెడివాడు. మేము మహావిష్ణుయాగము చేయవలెను. మహారుద్రయాగము చేయవలెను. మీగ్రామమునుండి చందాలు వేసికొని ఐదారువేలరూపాయిలు తీసికొని రావలెను. ఈవిధముగా చందాచేసి తెచ్చిన ధనములో కొంత భాగము ఆయన ఖర్చుచేసెడివాడు. మిగిలినభాగము తన ఖాతాలో జమకట్టి సుఖముగా కాలక్షేపము చేసెడివాడు. ఇట్టి దాంభికోపాయములతో ఆతడు చాలధనమును సంపాదించెను.

ఒకప్పుడు ఆగ్రామమునందలి జిజ్ఞాసువు ఒకరు ఇట్లు ప్రశ్నించెను:—

మీరు యోగికదా! భోగిగా నుండుటకు కారణమేమి?

స్వామి:- మేము రాజయోగులము. జనకమహారాజు రాజవైభవముతోనుండి యోగముద్వారా జ్ఞానము సంపాదించిన తరువాత సుఖభోగములను అనుభవించినట్లుగనే మేము రాజయోగమున ఉన్నాము.

జిజ్ఞాసు:- స్వామీ, యోగము నాల్గు రకములు. మంత్ర, లయ, హఠ, రాజ యోగములు.

"చతుర్థో రాజయోగః స్యాత్ తద్ద్విధాభావవర్జితః" అని రాజయోగము వర్ణించబడినది. నాల్గుయోగములలోను ద్వైతభావములేనిది రాజయోగము. కాని మీరు మీ ఇష్టమువచ్చిన అర్థముచెప్పి జనులను భ్రమపెట్టుచున్నారు. ఈమాటలు శిష్యులు విని క్రోధముతో ఆజిజ్ఞాసువుతో నిట్లనిరి.

"వెళ్ళవయ్యా. ఎంతమంది వచ్చారు! ధనవంతులు, మహారాజులు ఎందరో వచ్చారు. ఎవరు వచ్చినను ఇక్కడ వినయముగా ఉండవలసినదే! నీకు వినయముకాని, వివేకముకాని ఉన్నట్లు కానరాలేదు.

ఈ ధూర్తులను గురించి ప్రబోధచంద్రోదయమున వ్రాయబడినది:—

*సర్వజ్ఞా ఇతి దీక్షితా ఇతి చిరాత్ ప్రాప్తాగ్నిహోత్రా ఇతి।*
*బ్రహ్మజ్ఞా ఇతి తాపసా ఇతి దివా ధూర్తైర్జగద్వఞ్చ్యతే॥*

"ధూర్తులు మేము సర్వజ్ఞులము, దీక్షితులము, నిత్యాగ్నిహోత్రులము, బ్రహ్మజ్ఞులము, తపశ్శాలురము అని ప్రపంచమును పట్టపగలు దోచుకొనెదరు."

ఇట్లు గుడ్డినమ్మకముతో జనులయందు వారిఖ్యాతి వృద్ధిపొందసాగెను. వారిని భూమండలాచార్యపదముతోనే సంబోధించెడివారు. తాము ఆచార్యులమను గర్వముకూడ వారికి కలిగెను.

తుకారాము ఇట్లు చెప్పిరి:—

"గురుత్వమదముచే వీరు ఎల్లప్పుడును అపవిత్రులుగా నుండుచున్నారు. బ్రహ్మములో జాతి, జ్ఞాతిభేదములు లేవని చెప్పుదురు. ఆచారములను పాటించువాడు పవిత్రుడు ఎవడైన కన్పించినచో వానిని కంటకముగా భావించి తీసిపారవేయవలెనని తలచెదరు. ఇట్టి గురువులు, ఇట్టి శిష్యులు నరకమునకు పోవుదురు. గంటలతరబడి మాట్లాడెదరు. విరివిగా ఉపన్యసించెదరు. స్త్రీలను, బాలురను బుట్టలో వేసికొనెదరు. ఎల్లప్పుడు ఎదుటవానిని వశపరచుకొనుటకే ఏదో ఒక ఉపాయము చేసెదరు. బ్రహ్మమును నిరూపించెదరు. కాని చెప్పినట్లు నడువరు."

ఇట్టి కపటగురువులను, సంతులుగా తిరుగు దాంభికులను తుకారాము చెవులు మెలిపెట్టును.

ఈవిధముగా ఆస్వామివారు సంచరించుచుండ ఇతరగ్రామము నుండి పాదపూజ చేయుటకు ఆహ్వానము వచ్చెను. స్వామివారు పైకి

అనిష్టమును ప్రకటించెను. కాని చాలబ్రతిమాలుకొనినమీదట అచ్చటకు వెళ్లుటకు భక్తులకు తన అంగీకారమును తెలిపెను.

విశాలమగు ఒకభవనము వారికి విడిదికి ఇవ్వబడెను. అచ్చట ఒక ఉన్నతాసనముపై కూర్చుని ఉపన్యాసము ఇచ్చిరి. జనులు అపరిమితముగా వచ్చియుండిరి. గ్రామమునందలి ధనవంతులు, పూజ్యులు ఎవరైన వచ్చినచో వారికి ముందు కూర్చొనుటకు ఏర్పాట్లు జరిగెను. కాని జిజ్ఞాసువులు ఎవరైన వచ్చినచో వారికి ఎట్టి సౌకర్యములును కలుగజేయబడలేదు. ఆసమయమున నగర సేటు కుమారుడు సుందరవస్త్రాభరణభూషితుడయి గుర్రపుబండిలో భగవత్స్వరూపులగు ఆచార్యులను సందర్శించవచ్చిరి. ఉపన్యాసము పూర్తి అయినతదుపరి శ్రోతలు అందరు రూపాయి, రెండురూపా యిలు, ఐదురూపాయిలు ఇట్లు కానుకగా సర్పించెను. నగరశేటు కుమారుడు రెండు బంగారుకాసులను ఇచ్చెను. ఇది చూచి ఆచా ర్యులు ఇట్లు ప్రశ్నించిరి. ఈతడు ఎవనికుమారుడు? సభలోనున్న ఒక హాస్యగాడు ఇట్లనెను. "బంగారుకాసుల కుమారుడు." ఇంత మంది ఉండగా ఈతనినే అడుగుచున్నావేమి? నీకు కాసులు కానుకగా నిచ్చినందుకునా? ఇది విని శిష్యులు చాల బాధపడిరి.

అనంతరము మరియొక గ్రామమునుండి స్వామివారి పాద పూజకు ఆహ్వానము వచ్చెను. గడిచినగ్రామమునందలి పాదపూజ యందు ఆచార్యులవారికి సరియగుసన్మానము జరుగలేదు. ఈమారు అతిజాగ్రత్తగా సన్మానము జరుగు ఏర్పాట్లు చేయండి అని శిష్యులు ముందుగనే చెప్పిరి. అదేవిధముగా ఆసన్మానమున చాలమందివ్యక్తులు పాల్గొనిరి. ముందు ఢంకా, నగారాదివాద్యములతో ముందుగ్రామము వైపు పురుషులు స్వస్తివాచనములతో నడచుచుండిరి. వెనుక భక్తు రాండ్రు సంకీర్తనముచేయుచు నడచుచుండిరి. వారిరువురిమధ్య స్వామి

వారు హారతోరణములచే అలంకరించబడిన సుందరమగు పాలకిలో విరాజిల్లియుండిరి. హారములు, పుష్పములు, తులసి, బిల్వములు మొదలగువానితో స్వామివారిని పూజించిన సామగ్రి పాలకిలో ఉండెను. పుష్పాంజలిసమయమున పాలకిశోభ చూచి తీరవలెను. వారి ఊరేగింపు ఈ ఆడంబరములతో గ్రామముదాటి వెళ్ళుచుండెను. ఇంతలో ముందుగ్రామమువారు పాలకిని అలంకరించి స్వామివారిని, పరివారమును తమగ్రామము తీసికొనివెళ్ళుటకు వైభవోపేతముగా ఎదురుసన్నాహముతో వచ్చుచుండిరి. ఆసమయమున ఒకఒంటె ఆత్రోవను వచ్చెను దానికి చాల ఆకలి వేసెను. స్వామివారి పాలకీనిండ ఉన్న ఆకులను చూచి ఒంటె వానిని భక్షించుటకు అచటకు పరుగెత్తుకొని వచ్చెను. ఇది చూచి జనులు దానిని తరుము సాగిరి. కాని, ఒంటె మెడను సాచుసరికి ఆపాలకీ ఒంటెమెడమీద ఇమిడిపోయెను. కంగారులో ఒంటె పాలకితోసహా పరుగిడెను. స్వామివారు లోపలనే ఉండిపోయిరి. కావున జనులు ఒంటెను వెంబడించిరి. ఒంటె ఇంకను వేగముగా పరుగెత్తెను. చివరకు ఒకచోట అది కాలుజారి పడెను. అంతట స్వామివారికి గట్టిదెబ్బ తగిలెను.

ఇట్టి అసురసంపదకల నాస్తికులు దేహమే ఆత్మ అని తలచి ఉదయమునుండి సాయంకాలమువరకును శరీరమునకు అన్నపానాది వివిధపదార్థములను ఎంతయో ప్రేమతో పెట్టి పోషించెదరు. రోజంతయు వైభవవిలాసములయందు గడుపుదురు. జనులవద్ద తామే దైవమనుకొనునట్లు మసలుదురు.

స్వా. ని. :— దైవసంపదకల జనులు జగత్తునందు పూజలను పొందరు. ప్రభువును పూజించమని చెప్పుదురు. తమవైపునకు ప్రజలదృష్టి మరలకుండ భక్తి, వైరాగ్యము మొదలగు సాధనములను చెప్పి ఎల్లరను ప్రభువువైపునకు మరల్చుదురు.

స్వా. ప్ర. :— తమరు చెప్పినది నిజము.

ఒక మహమ్మదీయమహాత్ముని చెంతకు ఒకవ్యక్తి వచ్చి అడిగెను. జనులను పరమేశ్వరుని చెంతకు తీసికొనివెళ్ళుటకు వలయు అనుమతిని నాకు ఇమ్ము.

మహా:— జనులను పరమేశ్వరుని వైపునకు పోనిచ్చిన చాలును. నీవైపునకు రానియ్యకుము.

ఆవ్యక్తి:- మహాత్మా! ఇది ఎట్లు? ఎవరైన జనులను తన వైపునకు పరుగెత్తించునా?

మహా:— అవును. చాలమంది జనులు పరమేశ్వరుని వైపునకు వెళ్లకుండ తమవైపునకు మరల్చుకొనెదరు.

## అజ్ఞానులనే ధూర్తులు మోసగించెదరు.

శాస్త్రములను చదివినవారి చెంత ఈధూర్తుల దంభములు నడవవు. అజ్ఞానులను మాత్రమే వారు చేజిక్కించుకొనెదరు.

*అగతిత్వమతిశ్రద్ధా జ్ఞానాభ్యాసే రుచిర్నవై।*
*త్రయః శిష్యగుణా హ్యేతే ధూర్తాచార్యస్య పుష్టయే॥*

"బుద్ధివికాసము లేక, శ్రద్ధమాత్రమే కలిగియుండి, జ్ఞానాభ్యాసమునందు రుచిలేని శిష్యులు ధూర్తులగు గురువులకు ఎంతయో ఉపకరించెదరు."

ధర్మమా, అధర్మమా అనెడు వివేకము లేనివాడు గుడ్డినమ్మకము కలవాడు. అనగా అవివేకముతో నమ్మువాడు, ధర్మపరిజ్ఞానమునకు శాస్త్రాదికములను అభ్యసించనివాడు— వీరు తమోగుణ ప్రధానమగు బుద్ధి కలవారు. ఇట్టివారలను దాంభికులు వశపరచుకొనెదరు. కాని బుద్ధిమంతుల చెంతకు వారు చేరలేరు.

స్వా. ని. :— కొంతమంది శాస్త్రజ్ఞులయందుకూడ గ్రుడ్డినమ్మకము కానవచ్చుచున్నది. దీనికి కారణమేమి?

స్వా. ప్ర. :- యస్య నాస్తి స్వయం ప్రజ్ఞా శాస్త్రం తస్య కరోతి కిమ్ ।
లోచనాభ్యాం విహీనస్య దర్పణః కిం కరిష్యతి ॥

"అసలు బుద్ధిలేనివానికి శాస్త్రము ఏమి ఉపకరించును? కండ్లు లేనివానికి అద్దము ఏమి ఉపయోగము? అట్టివారికి శాస్త్రజ్ఞానము కూడ నిరర్థకము.

## స్వేచ్ఛాజీవికి పరమగతి లభించదు.

సమాధిహీనాః పాపిష్ఠా వాక్యార్థజ్ఞానమానినః ।
స్వేచ్ఛాచారరతా నిత్యం నరకానప్నువన్తి తే ॥

"సమాధిరహితులును, శాస్త్రార్థముమాత్రము గ్రహించి "నేను బ్రహ్మము" అనుకొనువారును పాపాత్ములు. వారు స్వేచ్ఛాచారపరాయణులు. వారికి నరకమే కలుగును."

శాస్త్రవాక్యముల జ్ఞానము బాగుగా కలిగినను శాస్త్రములచే బోధించబడిన సమాధియందు చతురతలేనివారును- అనగా నిర్వికల్పమును, సవికల్పమును అగు సమాధిని అభ్యసించనివారును, సాంసారికవాసనలతోనిండిన అంతఃకరణముకలవారును, శాబ్దికజ్ఞానమే సర్వస్వము అనుకొను విద్వాంసులును, తమసుఖముకొరకు అశాస్త్రీయమగు జీవితముగడుపువారును రౌరవనరకమును పొందెదరు.

ఒక బ్రహ్మనిష్ఠుడగు సన్యాసివద్దకు ఇద్దరు యువకులు సన్యాసదీక్షను పొందుటకు వెళ్ళిరి. వారిలో ఒకడు శ్రీమంతుల కుమారుడు. అతనికి తీవ్రవైరాగ్యము కలిగెను. రెండవవాడు దరిద్రుడు, మందవిరాగి. ఆసన్యాసి ఇక్కడే కొంతకాలము ఉండండి. మీయోగ్యతలు గమనించి దీక్ష నిచ్చెదను అని చెప్పెను. కాలాంతరమునందు ఇరువురకును దీక్షను ఇచ్చి యోగవిద్యను నేర్పెను. వారిరువురిని ఏకాంతమునకు వెళ్ళి యోగాభ్యాసమును చేయుమని ఆజ్ఞాపించెను. తీవ్రవైరాగ్యము కలవాడు ఒకగుహయందు ఉండి తన అభ్యాసము

పూర్తిచేసెను. శ్రీ మంత్రుల యొక్కయు, రాజులయొక్కయు సంసర్గమునందుండుటచే అతనికి ద్రవ్యాదిసంసర్గముచే ఆశ కలుగలేదు. ఒక సంవత్సరమునందే యోగసిద్ధిని పొంది జీవన్ముక్తుడయ్యెను. మంద వైరాగ్యము కలవాడు ఏకాంతమున అభ్యసించుచుండెను. జనులు అచ్చటికి మెల్లమెల్లగా వచ్చి అతనికి కానుకగా పదార్థములను అర్పించ మొదలిడిరి. వానియందు అతనికి దురాశ మెండయ్యెను. ద్రవ్యాదిపదార్థములను అతడు అంతకు పూర్వము చూచియుండలేదు. ఈవిధముగా అతని అభ్యాసము అంతకంతకు తప్పుదారిని సాగెను. అతడు నిర్వికల్పసమాధికి చేరలేదు. ఈసమయమున జనులు ఆతనితో ఇంతదూరము వచ్చుట చాలకష్టముగా నున్నది. గ్రామములోనికి వచ్చి ప్రవచనములు చేయుడని చెప్పిరి. అంతట ఆతడు అరణ్యమును వదలి గ్రామమునందలి ఒక కాళీయింటియందు ప్రవచనములు చేయుట ఆరంభించెను. మెల్లమెల్లగా అనేకమంది శిష్యులు చేరిరి.

అటుతరువాత ఒకరోజున సేవకులు అతనిని ఇట్లు ప్రార్థించిరి. “బాబూ! ఎంత స్వతంత్రము ఉన్నను ఇది పరగృహము. ఇంతకంటె తమకు ఒక స్వంతమఠము నిర్మించబడియున్నచో ఎంతయో అనుకూలముగా నుండును. ఆజ్ఞాపించినచో మఠమును నిర్మించెదము.

ఆయన :—“మావంటి సన్యాసులకు మఠము ఎందుకు? ఆత్మారాములము. ఎక్కడనో పడి ఉందుము.”

సేవకులు:— “బాబూ, ఇప్పుడు బాగుగనే ఉన్నది. శరీరమునందు శక్తి ఉన్నంతవరకు ఎక్కడికైనను వెళ్ళుచు వచ్చుచు ఉండగలరు. కాని వార్ధక్యమునందు వెళ్ళుటయును, వచ్చుటయును కష్టము. ఉత్తరావస్థయందు సుఖముగా ఒకచోట పడియుండుటకు ఇప్పుడే ఒక మఠమును నిర్మించుట మంచిది. అనేకమంది స్వాములు వార్ధక్యము

నందు ఉండుటకు మఠాదులను నిర్మించెదరు. వానిఏర్పాట్లకు ద్రవ్యో పార్జనకు సంబంధించిన సాధనములనుకూడ ఏర్పరచెదరు. తమరు మాయందు దయయుంచి నూా ఈమాత్రపు సేవలను అంగీకరించుడు. మాధనము తమవంటివారలకొరకు ఉపయోగపడుటకంటె మించిన భాగ్యము మాకు వేరేమి కలదు? మేము సంసారములో చచ్చుచు, పుట్టుచు ఉందాము. మమ్ము ఉద్ధరించువారు తమరుతప్ప అన్యులెవ రును లేరు. ఈపుణ్యమార్గమును మాకు తెరచినచో మావంశములు తరతరాలవరకును తరించును. మాభార్యాబిడ్డలు సుఖముగానుండురు. ఆజ్ఞాపించుడు. భూమి, ధనము అతిసులభముగా సేకరించి మఠమును నిర్మించెదము. తమకు ఏవిధమైన ఉపాధియును ఉండదు. అన్ని ఏర్పాట్లును మేమే చేయుదుము. మాకోరికలు ఈడేరునట్లు కృప జూపుడు. మేము ఈరోజున ఇట్లు ఉన్నాము. రేపు ఎట్లుండెదమో ఎవరికి తెలియును?"

ఆస్వామి దయార్ద్రహృదయుడై "మీకోరికప్రకారము చేయు" డని చెప్పెను. సేవకులు వందలకొలది రూపాయిలు చందావేసికొని రాజభవనమునకు మించినశోభతో వర్ధిల్లు మఠమును నిర్మించి, వాహనాది సకలవైభవములకును, వాటి వినియోగమునకును సరిపడు జాగీరును ధారాదత్తము చేసిరి. పశుధనమునుకూడ సమర్పించిరి. ఈ వైభవసాధనములు అనంతములగుటతో స్వామివారి ఆశలు అంత కంతకు పెరిగిపోయెను. వైభవముతో అతడు స్వేచ్ఛాజీవితము గడుప సాగెను.

సేవకులు ఇట్లనిరి:— "తమ ప్రారబ్ధమున ఈవైభవములు ఉన్నవి. ఇక స్వీకరించుటలో తప్పేమి కలదు? తమకు విధినిషేధములు వర్తించవు. తమరు పూర్ణజ్ఞానులు. జ్ఞానికి పరేచ్ఛాప్రారబ్ధము ఉం డును." స్వామివారుకూడ తాము జ్ఞాని అనియు, తమ ప్రారబ్ధమును

వైభవము కలదనియు అనుకొని భోగముల నన్నిటిని అనుభవించ సాగెను. కొందరకు సన్న్యాసదీక్షను ఇచ్చి మఠాదులను నిర్మింపజేయు టకు శిష్యులనుగా చేసికొనెను. ఇట్లు రోజురోజుకు శిష్యులు, సేవ కులు మొదలగువారిసంఖ్య పెంచవలెనను కోరిక అతనికి పెరిగి పోయెను.

ఇట్లు పన్నెండు సంవత్సరములు జరిగినతరువాత తను గురువు లను దర్శించవలెనను కోరిక స్వామివారికి కలిగెను. అంతట జనులు "తమగురువులు మాకు మహాగురువులు. వారిదర్శనముకూడ మాకు చేయించండి." అని పలికి వారి ఆజ్ఞగైకొని వెండిపాలకీలో స్వామి వారిని కూర్చుండబెట్టి రెండు మూడు వందలమంది శిష్యులు పెద్ద ఆడంబరముతో గురువుగారి దర్శనమునకు వెళ్లిరి. ఈవైభవముచూచి గురువర్యులు సంతోషించెదరని మన స్వామివారు అనుకొనిరి. గురువు గారు ఆయనను గుర్తించలేకపోయిరి. కావున ఇట్లు ప్రశ్నించిరి. "తమరు ఎవరు? ఎచ్చటనుండి వేంచేసిరి." నేను తమ శిష్యుడను. మరచితిరా!" అని ఆయన సమాధానము చెప్పెను.

గురు:-చాలకాలమైనది. ఇంతకాలము ఎచ్చటనుంటివి?

స్వామి:- ఫలాన నగరములో మా సేవకులు వైభవోపేతమగు మఠమును మాకొరకు నిర్మించిరి. సమస్త వైభవములను ఏర్పాటుచేసిరి.

గురు:-"వీరందరు ఎవరు?"

సేవకులు:-"మేమందరము స్వామివారి శిష్యులము. దేవా? తమరినికూడ ఆమఠమునకు దయచేయమని ప్రార్థించుటకు వచ్చి తిమి. తమరు అచ్చటకు దయచేసి మఠమును పవిత్రముచేయుడు."

గురు:-"మీరు ఇతని శిష్యులా? ఇతను మీ శిష్యుడా? ఏల నన, ఇతడు సన్న్యాసిగానుండగా మఠాదులను నిర్మించి ఇతనిని స్వేచ్ఛా జీవిగాచేసిరి. ఇప్పుడు నన్నుకూడ అక్కడకు పిలచుచున్నారు."

అటుతరువాత మఠాధిపతిఅయిన తనశిష్యునితో ఇట్లనెను.

"నీవు స్వేచ్ఛాజీవివి. నీవంటి పతితుడగు సన్యాసిని చూచినందున సచేలస్నానము చేయవలెను."

## స్వేచ్ఛాజీవియగు సన్యాసికి పట్టుగతి.

మఠేష్వభోజ్యమన్నం స్యాత్ భుక్త్వా చాన్ద్రాయణం చరేత్।
స్పృష్ట్వా మఠపతిం చైవ సవాసా జలమావిశేత్॥

(పద్మపురాణము.)

"మఠములందు భోజనము చేయరాదు. భుజించినచో చాంద్రాయణము చేయవలెను. మఠాధిపతిని స్పృశించినచో సచేలస్నానము చేయవలెను."

సన్యాసీ యో హి భూత్వా తు హిరణ్యం సంగ్రహేద్యతిః।
తస్య దర్శనమాత్రేణ సచైలో జలమావిశేత్॥ పద్మ.

"దీక్షతీసికొనిన సన్యాసి స్వర్ణమును సంపాదించినచో అతని దర్శనమాత్రమున సచేలస్నానము చేయవలెను."

ఆంగీరసఋషికూడ ఇట్లు చెప్పెను:—

క్షేత్రం గావో హిరణ్యం చ యతేర్యస్య పరిగ్రహః।
తాదృశం కల్మషం దృష్ట్వా సచైలో జలమావిశేత్॥

"భూమి, ఆవులు, సువర్ణము మొదలగువానిని సంపాదించు సన్యాసిని చూచిన సచేలస్నానము చేయవలెను.

నీవంటి పతితుడగు సన్యాసికి దేవరాజు ఇంద్రుడు మృత్యుదండనమును విధించును.

"అరున్ముఖాన్ యతీన్ శాలావృకేభ్యః ప్రాయచ్ఛమ్॥"

బహిర్ముఖులగు సన్యాసులను తన వజ్రప్రహారముచే చంపి ఇంద్రుడు మాంసభక్షులగు జీవులకు వేసెను.

ఇంద్రుడు ప్రతర్దనుడను రాజునకు చెప్పుచున్నాడు.

"ఒకమారు వైరాగ్యరహితులును బహిర్ముఖులునుఅగు సన్యాసులు గుమిగూడియున్నచోటికి నేను వెళ్ళి అడిగితిని. "మీరు ఎవరు?"

వారు:– "మేము సన్యాసులము." అని సమాధానముచెప్పిరి.

నేను అడిగితిని. "విషయములయందు ఉత్కృష్టమగు వైరాగ్యము కలిగినతరువాతనే ఆత్మజ్ఞానము పొందవలెనను కోరిక కలిగినప్పుడే సన్యాసము తీసికొనమని చెప్పబడినది. మీయందు వైరాగ్యాది సాధనసంపత్తి ఏమాత్రమును కన్పించుటలేదు. మీరు స్వేచ్ఛాజీవులు. సన్యాసులని మిమ్ము చెప్పుట ఎట్లు?"

అంతట వారికి నాపై క్రోధము వచ్చెను. ధర్మరక్షణము నా కర్తవ్యము కనుక వారి నుపేక్షించరాదని తలచి దండించ నిశ్చయించితిని. అనంతరము ఆదుర్మార్గులగు సన్యాసులనందరిని లోకరక్షణార్థము సంహరించితిని. వారి స్థూలశరీరములను మాంసమును భక్షించు పక్షులకు వేసితిని." అని ఇంద్రుడు చెప్పెను.

ఈవిధముగా నీవు రాజదండనమునకు పాత్రుడవు.

సన్యాసులు దేహరక్షణమునకు మించిన పరిగ్రహమును చేయరాదని శాస్త్రసమ్మతమగు సిద్ధాంతము.

*కౌపీనయుగలం కన్థా దణ్డమేకం పరిగ్రహః।*
*యతేః పరమహంసస్య నాధికం తు విధీయతే॥*

"పరమహంసయగు సన్యాసి రెండు కౌపీనములు, ఒకబొంత, ఒకదండము మాత్రమే సంగ్రహించవలెను. ఇంతకుమించి తనసొంత నుంచుకొనరాదు."

*యది వా కురుతే రాగాదధికస్య పరిగ్రహమ్*
*నరకం రౌరవం గత్వా తిర్యగ్యోనిషు జాయతే॥*

"ఏసన్యాసి అయినా రాగముచే ఇంతకుమించి సంగ్రహించినచో రౌరవనరకమును పొందును. పశుపక్షుల జన్మములను పొందును."

అట్లు ఆతనిని గురువుగారు గట్టిగా బుద్ధిచెప్పి నీవు వెంటనే ఇచ్చటినుండి పొమ్ము. నేటినుండి ఎప్పుడును నీముఖము కన్పించనీయకుమని చెప్పెను."

ఈ విధముగా స్వేచ్ఛాజీవితము 32 రౌరవాది నరకములను కలుగజేయును.

## శ్రద్ధయందలి రకములు.

ప్రభాశం:—నేను వెళ్ళిన ప్రతిచోటునందును వైభవాదులు మాత్రమే కన్పట్టుటచే అందునుగురించి ప్రశ్నించెడివాడను. జ్ఞానికి వేరువేరు ప్రారబ్ధములు ఉండును. కావున మా బాహ్యపరిస్థితులను గమనించక మామాటలపై శ్రద్ధకలిగియుండుము. అని సమాధానము వచ్చెడిది.

స్వా. ప్ర. :- అయినచో మీరు శ్రద్ధ కలిగియుండుట అనగా బుద్ధిపూర్వకముగా నుండుటయా లేక ఏదోవిధముగా నుండుటయా! అని అడుగవలసియున్నది.

ఇంతలో అక్కడ ఉన్నవారిలో నొకడు ఇట్లనెను :-

నమ్మకమునందు గ్రుడ్డినమ్మకము అనునది లేదు.

స్వా. ప్ర. :- తల్లిదండ్రులు, ఆచార్యులు, దేవుడు, వేదములు– వీనియందలి శ్రద్ధ గ్రుడ్డినమ్మకము అనిపించుకొనదు. మోహనగాంధి మొదలగువారిపై సూక్ష్మముగా ఆలోచించకుండ కలిగియుండు నమ్మకము గ్రుడ్డినమ్మకము అనిపించుకొనును.

సాత్త్విక్యాధ్యాత్మికీ శ్రద్ధా కర్మశ్రద్ధా తు రాజసీ,
తామస్యధర్మే యా శ్రద్ధా మత్సేవాయాం తు నిర్గుణా॥

భాగవతము.

ఆధ్యాత్మికమునకు సంబంధించిన శ్రద్ధ సాత్త్వికమగు శ్రద్ధ అనిపించుకొనును. కర్మలయందలి శ్రద్ధ రాజసశ్రద్ధ. అధర్మమునందలి శ్రద్ధ తామసశ్రద్ధ. నాయందు అనగా పరమాత్మునియందలి శ్రద్ధ నిర్గుణశ్రద్ధ. కావున శ్రద్ధ కలిగియుండవలెను. కాని గ్రుడ్డినమ్మకము కలిగియుండరాదు. వామమార్గమునందు చెప్పబడిన పంచమకారాదులు అధర్మయుతమయినవి. వానియందలి శ్రద్ధ గ్రుడ్డినమ్మకము. మోసగాండ్రు మొదలగువారియందుకూడ ఉంచునమ్మకము గ్రుడ్డి నమ్మకమే.

గ్రుడ్డినమ్మకముకల ఒకరాజు కథ వినుడు.

నలుగురైదుగురు సాధువుల గుంపు ఒకటి ఉండెను. వారిలో ఒకడు సిద్ధుడు, మిగిలినవారు సాధకులు. సిద్ధుడు దిగంబరి. తాను పంచమభూమికలో ఉన్నానని చెప్పుకొనెడివాడు. వీరు దేశమంతటను తిరుగుచుండిరి. అనేకమంది దర్శనము చేయుచుండెడివారు. ఇట్లు దేశమంతటను తిరుగుచు వారు ఒకరాజ్యమునకు వచ్చిరి. ప్రజలు అందరు వారిదర్శనము చేయుటకు వెళ్లిరి. గ్రుడ్డినమ్మకము కలరాజు కూడ వారిని దర్శించుటకు వెళ్ళెను. దర్శనానంతరము వారిని పాలకీలో కూర్చుండబెట్టి రాజభవనములోనికి తీసికొని వెళ్లెను. "వీరు సిద్ధులు. కావున దిగంబరులయినను ఏసంకోచములేకుండ వీరికి సేవ చేయవచ్చును." అని రాణితో చెప్పెను. రాణి స్వయముగా ఆదిగంబరికి సేవచేయుచుండెను. ఆదిగంబరి అక్కడనే మలవిసర్జనముకూడ చేసెను. రాణి ఆతని పరీక్షించుటకు ఒక పుల్లతో మలమునుతీసి ఆతని ముఖముపైకి విసరెను. ఆతడు ముఖమును తప్పించుకొనెను. అంతట నామె ఆతని చెంపపై చెల్లున ఒకలెంపకాయ వేసెను. సిపాయిలను పిలచి వాని అంతు చూడుమని ఆజ్ఞాపించెను. ఆరాణి తన

తండ్రిచెంత శాస్త్రాధ్యయనము చేసియుండెను. కావున ఆధూర్తుని పసి గట్ట గలిగెను.

బాహ్యాడంబరములను చూచి గుడ్డినమ్మకముతో ధూర్తుల బుట్టలో పడిపోరాదు.

*పరస్య బాహ్యకర్మాణి దృష్ట్వా ముహ్యతి యో నరః।*
*నాభ్యన్తరగుణాన్వేషీ సోత్రైవ మూర్ఖ ఉచ్యతే॥*

"ఇతరుల బాహ్యకర్మములను చూచి ముగ్ధుడగు నరుడు ఆంతరికములగు గుణములను పరికించలేడు. అతడు మూర్ఖుడనబడును." ఎవ్వడైన ధూర్తుడువచ్చి మనలను మోసముచేసినచో మనము మనుష్యుల మనబడవచ్చునా?

అంతట జేతపురమునుండి వచ్చిన లల్లూభాయి మొదలగువారు వెళ్ళిరి.